ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


నగునూరులో ధాన్యం తూకం వేస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో దుబ్బపల్లి, నగునూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య శుక్రవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, డైరెక్టర్లు పబ్బతి రంగారెడ్డి, చలమయ్య, సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, డైరెక్టర్లు సాయిల్ల మహేందర్, గంట శంకరయ్య, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ కాశెట్టి శ్రీనివాస్, సర్పంచులు ఉప్పుల శ్రీధర్, సిరిగిరి దుర్గ, పురుమల్ల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు సాయిల్ల వినయ్‌సాగర్, శ్రీనివాస్, సీఈవో రమేశ్ పాల్గొన్నారు.

మామిడి రైతులకు పరిహారం ఇప్పిస్తాం


రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ మధు

కొత్తపల్లి: ఈదురుగాలులతో నష్టపోయిన మామిడి రైతులకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి కమలాకర్ సహకారంతో పరిహారం ఇప్పించి, ఆదుకుంటామని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు అన్నారు. కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాలలో ఈదురుగాలులకు రాలిపోయిన మామిడి కాయలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అధికారుల ద్వారా నష్టాన్ని అంచనా వేయించి, కలెక్టర్‌కు అందించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడొద్దన్నారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ.షరీఫ్, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోదల చంద్రయ్య, ఆర్బీఏ సభ్యుడు తోట శ్రీపతిరావు, ఉపసర్పంచ్ అనిల్, వార్డు సభ్యుడు గోదల నగేశ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి వెంటనే నిర్మించాలి


మాట్లాడుతున్న సత్యం, పక్కన నాయకులు

విద్యానగర్: కరీంనగర్‌లో లెవల్ క్రాసింగ్ రైల్వే గేటు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీరోజు 18, 20 సార్లు గేటు పడుతుండటంతో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లేవారు, అత్యవసరంగా ఆసుపత్రులకు వచ్చే అంబులెన్స్‌లకూ ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రెండేళ్ల క్రితమే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.154 కోట్ల నిధులు తెచ్చానని చెబుతున్న ఎంపీ బండి సంజయ్ పనులు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకొని, బ్రిడ్జి నిర్మించేవరకు ప్రజల పక్షాన సీపీఎం పోరాటం చేస్తుందని చెప్పారు. సమావేశంలో పార్టీ నగర కమిటీ సభ్యులు పుల్లెల మల్లయ్య, జి.తిరుపతి, కొంపల్లి సాగర్, అరవింద్, నాయకులు కోనేటి నాగమణి, గాజుల కనకరాజు, రత్నం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు

- కరీంనగర్‌లో ప్రధాన రహదారి వెంట, కూడళ్లలో ఏర్పాటు
- గాలులు వీస్తే ఊడిపోతున్న వైనం
- విద్యుత్ తీగలపై పడి సరఫరాకు అంతరాయం
- వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం
- కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదంటున్న ప్రజలు


గాలులకు చిరిగిపోయి ప్రమాదకరంగా ఫ్లెక్సీ

'గురువారం రాత్రి నగరంలో వీచిన గాలులకు పలుచోట్ల ఫ్లెక్సీలు చిరిగిపోయి రోడ్లపై పడ్డాయి. మరికొన్ని విద్యుత్ తీగలపై వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. కొన్ని డివిజన్లలో రెండు, మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు సందర్భాల్లో చిన్నచిన్న గాలులకే ఫ్లెక్సీలు చిరిగిపోతున్నాయి.'

కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలతో ప్రమాదాలు చోటుచేసుకోవడమే కాకుండా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. నగరంలో ఫ్లెక్సీల వాడకాన్ని తగ్గించాలని ఆదేశాలున్నప్పటికీ అమలు కావడం లేదు. ఎక్కడపడితే అక్కడ భారీ హోర్డింగ్‌లపై వీటిని ఏర్పాటు చేస్తుండటంతో ఈదురుగాలులకు కింది పడుతున్నాయి. నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఉన్న భవనాలపై హోర్డింగ్‌లు కనిపిస్తున్నాయి. రోడ్లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే మున్సిపల్ అధికారులు వెంటనే తొలగిస్తారు. దీంతో ఎక్కువ మంది తమ వాణిజ్య, వ్యాపార ప్రచారానికి హోర్డింగ్‌లను ఆశ్రయిస్తూ పెద్ద పెద్ద ఫ్లెక్సీలు పెడుతున్నారు. ఇందుకోసం ఏటా మున్సిపల్ ఫీజు చెల్లిస్తున్నప్పటికీ నిబంధనలు పాటించకుండా, నాణ్యత లేకుండా ఫ్లెక్సీలు బిగిస్తుండటంతో చిన్నపాటి గాలి వీచినా కింద పడుతున్నాయని ప్రజలు అంటున్నారు. వీటితోపాటు వీఐపీ, ఇతర కార్యక్రమాల కోసం ఏర్పాటు చేస్తున్న వాటిని కొన్ని డివిజన్లలో వారాల తరబడి తొలగించడం లేదు. గాలులు వీచినప్పుడు అవి కిందపడి, వాహనాదారులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. కొన్ని డివిజన్లలో కార్పొరేటర్లు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు వారాల తరబడి రోడ్లపై పడి ఉంటున్నాయి. అయినా వాటిని తొలగించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఫుల్ డిమాండ్..

ప్రచార బోర్డులు ఏర్పాటు చేసేందుకు ప్రధాన రహదారి వెంట, కూడళ్ల వద్ద ఉన్న భవనాల యాజమానులు పై అంతస్తులను అద్దెకు ఇస్తున్నారు. వ్యాపార సంస్థలు కూడా ప్రధాన కూడళ్లను ఎంచుకుంటున్నాయి. దీంతో వీటికి ఫుల్ డిమాండ్ ఉంటోంది. అయితే భవనాల యాజమానులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నవారు నిబంధనలు పాటించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. వాస్తవంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలంటే సదరు భవనానికి సామర్థ్య పరీక్షలు నిర్వహించాలి. కానీ అలా చేయకుండా హోర్డింగ్‌లు నిర్మిస్తున్నారు. ఇక నూతన భవనాలను నాణ్యత లేకుండా నిర్మిస్తుండటంతో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే ఊడిపోతున్నాయి.

జరిమానా విధించని అధికారులు..

కరీంనగర్ బస్టాండ్, కమాన్, మంచిర్యాల చౌరస్తా, తెలంగాణ చౌక్ ప్రాంతాల్లో రోడ్లపై కూడా స్టాపర్లు ఏర్పాటు చేసి, వాటికి ఫ్లెక్సీలు కడుతున్నారు. మున్సిపల్ అధికారులు వీటిని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జరిమానా విధించాల్సిన అధికారులు వాటి ప్రారంభోత్సవాలకు సైతం హాజరవుతున్నారన్న విమర్శలున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

హోరింగ్‌లు ఏర్పాటు చేస్తున్న భవనాలకు నాణ్యత, సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తాం. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటాం. నాణ్యతాప్రమాణాలు పట్టించుకోకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– సుభాష్, డీసీపీ, కరీంనగర్ కార్పొరేషన్

చిత్ర కథ — ప్రమాదకరంగా డ్రైనేజీ


స్మార్ట్‌సిటీలో భాగంగా రేకుర్తి అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీసీ రోడ్లు వేశారు. పక్కనే డ్రైనేజీ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఘనంగా చుల్‌బులి నాటంకి–2023


జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి: అక్షయ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఫేర్‌వెల్ సంబరాలు 'చుల్‌బులి నాటంకి–2023' పేరిట శుక్రవారం స్థానిక సీతారాంపూర్‌లోని ఓ గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్ వి.రవీందర్ రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్య కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకొని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఏటా మాదిరిగానే ఈసారీ చాలా మంది విద్యార్థినులు ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థినుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ జి.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.అనిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సప్తగిరికాలనీ: వరి కోతలు మొదలై, వారం రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎడవెల్లి మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళారులకు విక్రయిస్తే తక్కువ ధర వచ్చి, అన్నదాతలు నష్టపోతారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం టౌన్ అధ్యక్షుడి నియామకం


రాములు

కరీంనగర్: భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) భవన నిర్మాణ కార్మిక సంఘం టౌన్ అధ్యక్షుడిగా బొంకూరి రాములును నియమించినట్లు బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాములు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.రూప్‌సింగ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆకుల మల్లేశం, రాఘవులు, సునీతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాస్థాయి వుషు శిక్షణ శిబిరం ప్రారంభం



కరీంనగర్‌స్పోర్ట్స్: నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే చిన్నారులకు ప్రాచీన కళ అయిన వుషు క్రీడలో ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని ప్రముఖ వైద్యుడు ప్రదీప్‌కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఫండస్ పాఠశాల వేదికగా ఏర్పాటు చేసిన వుషు వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించి, మాట్లాడారు. వుషు క్రీడతో ప్రభుత్వ ఉద్యోగులుగా, వివిధ కళాశాలల్లో విద్యాలయాల్లో శిక్షకులుగా ఎందరో రాణిస్తున్నారని, వుషు క్రీడాకారులుగా కరీంనగర్ జిల్లాకు ఖ్యాతి తెస్తునారని వారిని అభినందించారు. కార్యక్రమంలో యంగ్ సైంటిస్ట్ అనూష, కరస్పాండెంట్ పద్మజ ప్రభాకర్ రెడ్డి, వుషు జిల్లా ప్రధానకార్యదర్శి విద్యాసాగర్, పాఠశాల డైరెక్టర్ శశాంక, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మామిడి పండ్లు పంపిణీ


మామిడి పండ్లు అందిస్తున్న అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్

విద్యానగర్: రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత బొప్పు శ్రీహరి తన వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ పద్ధతిలో పండించిన మామిడి పండ్లను రంజాన్ సందర్భంగా శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ చేతుల మీదుగా ముస్లింలకు, పారిశుధ్య కార్మికులకు, అనాథలకు పంపిణీ చేశారు. నాలుగేళ్లుగా ఏటా రంజాన్ సందర్భంగా మామిడి పండ్లు అందిస్తున్న శ్రీహరి, ఆయన కుటుంబసభ్యులను అదనపు కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ సత్యనారాయణ, కార్పొరేటర్ బర్కత్ అలీ, బొప్పు వాసు, దేవేందర్ పాల్గొన్నారు.

ఈద్ ప్యాక్‌లు అందజేత

కరీంనగర్ కల్చరల్: సహర బైతుల్ మాల్ సొసైటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిరుపేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా శుక్రవారం ఈద్ ప్యాక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర జయంతి వేడుకలకు రావాలి

సప్తగిరికాలనీ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం శ్రీ మహర్షి బసవేశ్వర జయంతి వేడుకలను ఉదయం 11 గంటలకు కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు, జిల్లా ప్రజాప్రతినిధులు, వీరశైవ కుల బాంధవులు హాజరు కావాలని కోరారు.

నేడు శివపార్వతుల కల్యాణం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో శనివారం ఉదయం 11 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో కల్యాణం అనంతరం అన్నదానం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

'ఆ కళాశాలల గుర్తింపు రద్దు చేయండి'

సప్తగిరికాలనీ: పదోతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రామండ్లపల్లి యుగంధర్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. పరీక్షలు అయిపోయిన వెంటనే ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వకున్నా ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం తరగతులను ప్రారంభించి, విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

సలావుద్దీన్ ఒవైసీ వర్ధంతి


ప్రార్థనలు చేస్తున్న ఎంఐఎం నాయకులు

విద్యానగర్: ఏఐఎంఐఎం మాజీ అధ్యక్షుడు, హైదరాబాద్ మాజీ ఎంపీ దివంగత సలావుద్దీన్ ఒవైసీ 15వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. కరీంనగర్ దారుస్సలాంలో పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమరుద్దీన్, కార్పొరేటర్ శర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రండి


సీపీ సుబ్బారాయుడుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కొత్తపల్లి: మండలంలోని బద్దిపల్లిలో గల స్వయంభూ శ్రీ అలివేలు మంగ లక్ష్మీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడుకు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. సర్పంచ్ రాచమల్ల మధు, ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు తిరుపతి, కోశాధికారి గోలి రాజు, పెరిక శ్రీకాంత్, అర్చకులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా నగరంలోని సలేహ్‌నగర్ ఈద్గా వద్ద ఏర్పాట్లను కాంగ్రెస్ నగర శాఖ నాయకులతో శుక్రవారం పరిశీలించారు. పార్టీ నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గాలిదుమారం వల్ల పరదాలు, పైపులు దెబ్బతిన్నాయని, వాటిని మళ్లీ ఏర్పాటు చేయాలన్నారు. గతేడాది తాగునీటికి ఇబ్బంది ఏర్పడిందని, ఈసారి ఎండలు మండిపోతున్నాయి కాబట్టి తాగునీరు అందుబాటులో ఉంచాలని కోరారు. యువకులు వాహనాలను అతివేగంగా నడపొద్దని, జాగ్రత్తగా ఈద్గా వద్దకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఎండీ.చాంద్, ఖాజాఖాన్, పొరండ్ల రమేశ్, కీర్తి కుమార్, కంకణాల అనిల్ కుమార్, నదీమ్, జాఫర్, మహమ్మద్ బారీ, హనీఫ్, శివరాం, ఇమ్రాన్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి పిల్లలకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న జైపాల్‌రెడ్డి

సప్తగిరికాలనీ: పద్మనగర్‌లోని సిరిసిల్ల బైపాస్ రోడ్ మానేర్ స్కూల్ చౌరస్తా వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు బైరెడ్డి రజిత మృతిచెందిన విషయం విధితమే. ఆమె పిల్లలు ప్రజ్ఞాంత్ రెడ్డి, కృషిక్ రెడ్డిలను మైత్రి సంస్థల అధినేత కొత్త జైపాల్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లో పిల్లల ఉన్నత విద్యకు తన వంతు సహాయసహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నల్ల శ్రీనివాస్‌రెడ్డి, నర్రా శ్రీనివాస్‌రెడ్డి, గంప సత్యనారాయణ, భూపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణాసంస్థ హైదరాబాద్ నందు 2023–24 విద్యాసంవత్సరానికి మూడేళ్ల పాలిటెక్నిక్ కోర్సులకు గాను తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు, ఇతర నిరాశ్రయులైన పిల్లలు, చిల్డ్రన్ హోమ్, మహిళా సంస్థల్లోని బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు, వికలాంగుల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కే.సబితా తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్(60 సీట్లు, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(60) సీట్లు, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ (60)సీట్లు డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ 60 సీట్లకు మొత్తం 240 సీట్లలో 70శాతం సీట్లు బాధిత బాలికలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు. బాలికలు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు వసతి కల్పిస్తున్నామన్నారు. దరఖాస్తులకు భగత్‌నగర్‌లోని బాలరక్షాభవన్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మే 10వ తేదీ సాయంత్రం 4గంటల లోగా దరఖాస్తులను సమర్పించాలని, వివరాలకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి(డీసీపీవో)ని సంప్రదించాలన్నారు.

'దళితబంధు'తో వ్యాపారవేత్తలుగా ఎదగాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: దళితబంధుతో లబ్ధిదారులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయిరూప గార్డెన్స్‌లో వివిధ రకాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు పథకంతో సేల్స్‌మెన్ యజమానులుగా, క్లీనర్లు, డ్రైవర్లు ఓనర్లుగా మారారని, సొంతంగా షాపులు పెట్టుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, బి.శ్రీనివాస్, మండల అభివృద్ధి అధికారులు విజయలక్ష్మి, కల్పన, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సెక్రెటరీ గణపతి, దళిత బంధు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలపై అవగాహన


మాట్లాడుతున్న డీడబ్ల్యూవో సబిత

సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శుక్రవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హాస్టల్‌లో శానిటరీ న్యాప్‌కిన్స్ ఇన్సిరేటర్‌ను విద్యార్థినుల చేత ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూవో సబిత లింగ వివక్షత, పీసీపీఎన్‌డీటీ ఆక్ట్, ఆడపిల్లల వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీడీపీవో ఉమారాణి, ప్రిన్సిపాల్ లీలాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల డిప్యుటేషన్లు రద్దు చేయాలి

కరీంనగర్: జిల్లాలో పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులే కాకుండా స్పోర్ట్స్ స్కూల్, జైళ్లు, డైట్ కళాశాల, డీఈవో కార్యాలయం, జిల్లా సైన్స్ కేంద్రంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులను కూడా రిలీవ్‌చేసి సొంత పాఠశాలల్లో చేరేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ.. డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాంసాని ఉమారాణి, తూముల తిరుపతి శుక్రవారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25 నుంచి నిర్వహించే ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్, ఇన్విజిలేటర్ల విధులు పరీక్ష కేంద్రాలకు 8 కి.మీ ల పరిధిలో ఉపాధ్యాయులకు సీనియార్టీ ప్రకారం కేటాయించాలన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షల విధుల కేటాయింపుల్లో పాటించిన నిబంధనలు, పరిమితులు బహిర్గతం చేయాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు కె.రాజమౌళి, ఏ.నరహరి, ఏ.దామోదర్, రాష్ట్ర కౌన్సిలర్స్ టి.తిరుపతి, ఎం.సదానందం, వి.రాంకిరణ్ తదితరులు పాల్గొన్నారు.